క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన 'నాగపురి'



జనగామ: రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసిన గౌడ సంఘం నాయకులు



చిల్పూరు: గౌడ సంఘం మండల నాయకులు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద త్వరలో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని కోరినట్లు తెలిపారు. గణగోని రమేశ్, కంకటి రాజన్న, సంతం రాజు, మోడెం విజయభాస్కర్, డిష్ వెంకన్న, మాచర్ల ప్రవీన్, శ్రీను, గొల్లపల్లి సారయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



దేవరుప్పుల/పాలకుర్తి/పాలకుర్తిటౌన్: రాష్ట్ర పురోభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశ్రామిక ఔత్సాహికుల పెట్టుబడుల కోసం ఆహ్వానించేందుకు వెళ్లిన టూర్‌లో భాగంగా మంగళవారం అమెరికాకు వెళ్తున్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నల్ల శ్రీరామ్, తొటకూరి పాండుకృష్ణ, ఇనుముల నాగరాజు, మండల నాయకులు ఉన్నారు.

మత్స్యశాఖ చైర్మన్‌ను..

నర్మెట: మత్స్యశాఖ సొసైటీ మండల అధ్యక్షుడు వంగాల గోవర్దన్ ఆధ్వర్యంలో నాయకులు ఆ శాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మార్యద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఈసందర్భంగా వారికి చైర్మన్ హామీ ఇచ్చారని మండల నాయకులు తెలిపారు. గండిరామారం సొసైటీ అధ్యక్షుడు వాడపల్లి రాజు, నర్మెట సొసైటీ ఉపాధ్యక్షుడు సమ్మయ్య తదితరులు ఉన్నారు.

సీఐని..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జి.వేణును కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. నాయకులు వక్కల రాజు, యువరాజ్, జానీ, శ్రీకాంత్, మునీర్‌పాషా ఉన్నారు.

అభినందనీయం



లింగాలఘణపురం: మండలంలోని కుందారం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వై.వెంకటేశ్వర్‌రెడ్డి ఉదారత అభినందనీయమని నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి రూ.35వేల సొంత ఖర్చులతో 60 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ పార్వతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు



జఫర్‌గఢ్: అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో గాంధీసెంటర్–స్టేషన్‌ఘన్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను తాడెం కుమార్ అడ్డుకుని కోర్టుకు వెళ్లడంతో రోడ్డు నిర్మాణ పనులు ఏడాదిన్నరగా నిలిచిపోయాయి. దీంతో రహదారిపై గుంతలు ఏర్పడి బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో స్వయంగా ఎమ్మెల్యే పరిశీలించి రోడ్డు సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించాడు. కాగా, ఆర్డీఓ వెంకన్న స్థానిక తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, నాయబ్ తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్సై రామ్‌చరణ్‌తో కలిసి రోడ్డును మంగళవారం సందర్శించారు. గ్రామస్తుల సమక్షంలోనే రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం తెలిపిన కుమార్‌ను పిలిపించి రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ వేయించి మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీహరి ఆదేశాల మేరకు రోడ్డును పరిశీలించడంతో పాటు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న ఆర్డీఓ వెంకన్న



జనగామ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చిల్పూరు: పల్లగుట్టలో..



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న తహసీల్దార్



స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్

తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, పార్టీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో, విద్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రజలను చైతన్య పరిచిన ఉద్యమ నాయకుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: డీసీసీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు



లింగాలఘణపురం: కొత్తపల్లిలో..



నర్మెట: తహసీల్‌లో..



తరిగొప్పుల: తహసీల్దార్ కార్యాలయంలో..



దేవరుప్పుల: బీఆర్‌ఎస్ కార్యాలయంలో..



కొడకండ్లలో..



బచ్చన్నపేటలో..



పాలకుర్తి: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



జఫర్‌గఢ్: మోడల్ స్కూల్‌లో..

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



జనగామ: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పల్లా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైస్ చైర్మన మేకల రాంప్రసాద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మసిఉర్ రెహమాన్, కౌన్సిలర్ ఎండీ సమ్మద్, నాగరాజు, మారబోయిన పాండు, జూకంటి శ్రీశైలం, ఉల్లెంగుల సందీప్ పాల్గొన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్‌గౌడ్ తండ్రి రామస్వామి బ్రెయిన్ స్ట్రోక్‌తో జనగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. రామస్వామి ఆరోగ్య స్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన గాడిపెల్లి రమేశ్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పూర్వవిద్యార్థులు మంగళవారం రమేశ్‌ను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పోచన్నపేటలో..

బచ్చన్నపేట: పోచన్నపేటలో పేద కుటుంబానికి చెందిన ఇప్ప పద్మకు సామాజిక సేవాకర్త పోతుల రాములు యాదవ్ ఆర్థికసాయం చేశారు. 25 కిలోల బియ్యంతోపాటు రూ.500 అందజేశారు.

దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రడపాక ప్రదీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దళిత మోర్చా ఘన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ వద్ద తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు, ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహాల పునర్‌నిర్మాణం తదితర అంశాలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులకు చేసిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు అరిసెల తిరుపతి, కె.శరత్‌కుమార్, బూర్ల విష్ణు, రాజేశ్వర్‌రెడ్డి, రజిత, రాజేష్‌రెడ్డి, మారబోయిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిల్పూరులో..

చిల్పూరు: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దళిత మోర్చా మండల అధ్యక్షుడు కందుకూరి రజనీకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయబ్ తహసీల్దార్ రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్, కోర్నేలు, వలబోజు బ్రహ్మచారి, నామాల రాహుల్, శైలేష్‌గౌడ్, ప్రణయ్, రాజు, అశోక్, రమేష్, సంపత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత

స్టేషన్‌ఘన్‌పూర్: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి మంగళవారం మండలంలోని స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం, రంగరాయగూడెం, సముద్రాల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో రెండో రోజు చేపట్టిన వాటర్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పిచ్చిమొక్కలుతొలగించడం తదితర పనులను వారు పరిశీలించారు. డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్, ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ, కార్యదర్శులు శ్రీకాంత్, అవినాష్, సంతోష్, ఇర్ఫాన్, నరేష్, ఏపీఓ ప్రేమయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కరణ్, ఆశలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఇప్పగూడెం పీహెచ్‌సీ పరిశీలన

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇప్పగూడెం పీహెచ్‌సీని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఎంపీడీఓ మధుసూధన్, పీహెచ్‌సీ డాక్టర్ ఇంజమామ్‌అలీ, పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: వాటర్‌ట్యాంక్ వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు తదితరులు

పరిశుభ్రతను పాటించాలి

కొడకండ్ల: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త వహించవచ్చని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సిబ్బంది కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటారు. ఏపీఓ కుమారస్వామి, ఈసీ రమేష్, టీఏ యాకయ్య, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ట్యాంకుల శుభ్రం

చిల్పూరు: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలో వాటర్ ట్యాంకులను అధికారులు శుభ్రం చేయించారు. ఎంపీడీ చంద్రశేఖర్, తహసీల్దార్ సరస్వతి, నాయబ్ తహసీల్దార్ రామారావు, మూడిక అనేష్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఉపాధిహామీ ఏపీఓ మోహన్‌రావు, మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్దన్ పాల్గొన్నారు.

తాగు నీటి పరిశీలన

బచ్చన్నపేట: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో తాగు నీటిని అధికారులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్‌ల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు.

ఉద్యోగికి బదిలీ సహజం



సుగుణాకర్‌రాజును సన్మానిస్తున్న గోపాల్‌రావు

జనగామ: ఉద్యోగికి బదిలీ సహజమని మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ గోపాల్‌రావు అన్నారు. మంగళవారం జనగామలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో తొర్రూర్‌కు బదిలీ అయిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజును శాలువాలతో పలువురు సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి సుగుణాకర్ రాజు చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు అనురాధ, మధుసూదన్‌రెడ్డి, ప్రొఫెసర్లు, అధికారులు, వైద్యులు శంకర్, చంద్రమౌళి, స్వప్న, లింగమూర్తి, మహేష్‌కుమార్, విద్యావతి, ఇందిర, విజయ, రాణి, మరియమ్మ ఖాజాషరీఫ్ పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సిద్ధంకండి



రఘునాథపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సులుగు రమేశ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, ముప్పిడి ఎల్లయ్య, ఉడుముల జయమ్మ, చిట్యాల ఉప్పలయ్య, బాల్నె ఉదయ్, చాట్ల లచ్చినర్సు, శాగ ఐలయ్య, చాడ ఎల్లయ్య పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

లింగాలఘణపురం: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. రూ.4,770లు సేకరించి జిల్లా పార్టీకి అప్పగించినట్లు నాయకులు తెలిపారు. దేవదానం, సమ్మయ్య, చెన్నూరి ఉప్పలయ్య, లగ్గాల రమేశ్ దతరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: పాలకుర్తి ప్రెస్ క్లబ్, సీపీఎంల ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. రూ. 12,770 సేకరించి పార్టీ మండల కార్యదర్శి మాచర్ల సారయ్యకు నాయకులు అందజేశారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

జఫర్‌గఢ్: తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.అనిత అన్నారు. వడ్డెగూడెంలో అంగన్‌వాడీ–6 కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తప్పని సరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల అంగన్‌వాడీ–2, నేలపోగుల అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాల్లో ఏఎన్‌ఎం సంపూర్ణ, సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, విజయతో పాటు ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: ముర్రుపాలతో శిశువుతోపాటు జన్మనిచ్చిన తల్లికి బహుళ ప్రయోజనం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని సీతారాంపురం, పడమటితండా(డీ)అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారు. జీపీ కార్యదర్శి టి.స్వప్న, ఐకేపీ వీఓఓ శిరీషా, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, సువర్ణ, యాకలక్ష్మి, రామతార, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



దేవరుప్పుల: అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

సమకాలీన జీవితాలకు దర్పణం కవిత్వం

నర్మెట: సమకాలీన జీవితాలకు కవిత్వం అద్దం పడుతుందని డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు అన్నారు. కరాదుల వెంకట్‌రెడ్డి ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత్రి, గాయని అరుణ కీర్తి పతాక రచించిన బతుకు సంతకం పుస్తకంను మచ్చుపహాడ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి పండుగ వ్యవస్థాపకుడు, కవి మహ్మద్ సిరాజుద్దీన్, రాంపల్లి మల్లికార్జున్ రావు, న్యాయవాది సౌమిత్రి లక్ష్మణాచార్యులు, గంకిడి మల్లారెడ్డి, కవి, గాయకుడు కరాదుల జనతా ప్రభాకర్ రెడ్డి, భార్గవ రాంరెడ్డి, జి.కృష్ణ, లగిశెట్టి ప్రభాకర్, చిలుమోజు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకు సంతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఆభరణాల అప్పగింత

జనగామ: ఓ మహిళా ప్రయాణికురాలు మూత్రశాలకు వెళ్లి వచ్చేసరికి ఆర్టీసీ బస్సు బయలుదేరి వెళ్లిపోవడంతో పోగుట్టుకున్న బంగారు, వెండి ఆభరణాలు ఔట్ సోర్సింగ్ కానిస్టేబుల్ చాకచక్యంతో వ్యవహరించడంతో తిరిగి సదరు ప్రయాణికురాలికి అప్పగించడం జరిగింది. పోచంపల్లి గ్రామానికి చెందిన అడెపు రాధమ్మ హైదరాబాద్ వెళ్లేందుకు మంగళవారం తొర్రూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు జనగామ డిపోకు చేరుకోగానే మహిళ బస్సు కండక్టర్‌కు సమాచారం ఇవ్వకుండానే మూత్రశాలకు వెళ్లింది. ఇది గమనించకుండానే బస్సు బయలుదేరి వెళ్లిపోయింది. దీంతో రాధమ్మ డిపో అధికారులకు సమాచారం అందించింది. దీంతో అధికారులు ఔట్ సోర్సింగ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తెలుపడంతో చాకచక్యంగా వ్యవహరించి మహిళ ప్రయాణించిన బస్సు వివరాలు సేకరించి బ్యాగును తెప్పించారు. అట్టి బ్యాగులోని బంగారు నక్లెస్, పుస్తెలతాడుతో పాటు 40 తులాల వెండి ఆభరణాలను డిపో మేనేజర్ స్వాతి, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, యాకయ్య సమక్షంలో రాధమ్మకు అందజేశారు.



రాధమ్మకు ఆభరణాలు అప్పగిస్తున్న పోలీసులు

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

జనగామ రూరల్: కుల వృత్తి పై ఆధారపడి అనేక అవస్థలు పడుతున్న విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా కన్వీనర్ రామేశ్వరాచారి కోరారు. ఈ మేరకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు పలు డిమాండ్లతో కూడిన వినపత్రాన్ని మంగళవారం అందజేశారు. వెంకటేశ్వర్లు, చక్రపాణి, ఆంజనేయులు, కృష్ణమూర్తి, నగేష్, జగన్, ప్రసాద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రాక్‌స్టార్ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడిగా అవినాష్



నర్మెట: మండలంలోని వెల్దండ రాక్‌స్టార్ ఫ్రెండ్స్ యూత్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బొల్లం అవినాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 40 మంది కమిటీ సభ్యులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కాసర్ల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా దామెర నవీన్, కార్యదర్శిగా కళ్యాణం రాజు, కోశాధికారిగా కళ్యాణం మోహన్‌బాషా, ముఖ్య సలహాదారుగా బూర్గు చిరంజీవి, సలహాదారుగా బైరగోని పవన్, సభ్యులుగా వడ్డేపల్లి కిరణ్, నీల శ్రీకాంత్, కళ్యాణం రాజు, కుంచం బలవద్దిరాజు, నీల రాజు, శ్రీవచ్చల్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత తొమ్మిదేళ్లుగా ఉమ్మడి మండలాల్లో పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న యూత్ కమిటీ పలు సంస్థలచే ప్రశంసపత్రాలను అందుకుంది.

పోలీసులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



జనగామ రూరల్: షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీతపై దాడి ఘటనలో పోలీసులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పల్లెర్ల లలిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళలతో నిరసర వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు హనుమకొండ లయన్స్ క్లబ్ –330 ఎఫ్, వినూత్న క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కొమురయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షులు జయశ్రీవందనం, వైస్ ప్రెసిడెంట్ రొడ్డ రాజిరెడ్డి, దావీద్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, జానకి, ఇందిర, సంతోషి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, పాఠశాల హెచ్‌ఎం సదామోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కకు తలకొరివి పెట్టిన సోదరి

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన శ్రీపతి రాజలక్ష్మి (70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా రాజ్యలక్ష్మికి భర్త, పిల్లలు లేకపోవడంతో సోదరి మంద నర్సమ్మ ఆమె వద్దే ఉంటోంది. నర్సమ్మకు కూడా పిల్లలు లేకపోవడంతో అక్కకు తలకొరివి పెట్టింది.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

జనగామ రూరల్: అనారోగ్యంతో గుర్తు తెలియని రైలు కిందపడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం పెంబర్తి–జనగామ రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు రమణారెడ్డి, నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాణాపురం ఇందిరమ్మకాలనీకి చెందిన నాయిని అంజయ్య (76) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా, జీవితంపై విరక్తి చెందిన అంజయ్య గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు సందర్శించి కేసు నమోదుచేసుకుని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.